క్లుప్తంగా

నడిగూడెం డిప్యూటీ తహసీల్దార్‌గా హేమలత


బాధ్యతలు స్వీకరిస్తున్న హేమలత

నడిగూడెం : నడిగూడెం డిప్యూటీ తహసీల్దార్‌గా హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. మునగాలకు డిప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్న హేమలత నడిగూడెంకు బదిలీపై వచ్చినట్లు నడిగూడెం తహసీల్దార్ హేమామాలిని విలేకరులకు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని వినతి

మోతె : మోతె మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజు గురువారం మోతె మండల కేంద్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి వినతి పత్రం అందజేశారు. మోతె మండలంలో 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఇంటర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మోతె మండలానికి ఇంటర్ కళాశాలతో పాటు వసతి గృహం కూడా మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్- 2, ఎల్-3 కాలువలకు సీసీ లైనింగ్ నిర్మించాలి

చిలుకూరు : మండలంలోని ముక్యాల కాలువకు అనుసంధానంగా ఉన్న ఎల్- 2 ఎల్- 3 మైనర్ కాలువలకు సీసీ లైనింగ్ నిర్మించాలని స్థానిక టీడీపీ నాయకులు బుధవారం రాత్రి చిలుకూరుకు వచ్చిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువల పరిధిలో 600 మంది రైతులు 2000 ఎకరాల భూమి సాగు చేస్తున్నారని, కాలువలకు సీసీ లైనింగ్ నిర్మిస్తే చివరి భూములకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, మస్తాన్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలు వేలం


కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన 3 ఎకరాల 33 గుంటల వ్యవసాయ భూమి కౌలు వేలం పాటను గురువారం ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదయ శాఖ అధికారి రమేష్, ఆలయ మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రిలు మాట్లాడారు.. ఆలయ భూములు రెండు సంవత్సరాలు కౌలు చేసుకునేందుకు వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలం పాటను గ్రామానికి చెందిన మంగ ప్రభాకర్ రూ. లక్ష 75 వేల 900లకు దక్కించుకున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వం పంటల ప్రణాళిక ప్రకటించాలి

మోతె : ప్రభుత్వం పంటల ప్రణాళిక ప్రకటించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కసుకుంట్ల సైదులు కోరారు. ఈమేరకు గురువారం మోతె తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుతుపవనాలు వస్తున్నందున విత్తనాల కోసం రైతులు పడికాపులు కాస్తున్నారన్నారు. విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి అమలు చేయాలని కోరారు. అన్ని పంటలకు ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట ఏఐకేఎంఎస్ నాయకులు కొమ్ము వెంకన్న, ఆవుల యలమంచి, బాలాజీ, లింగ ఉన్నారు.

కూరగాయల ధరలను నియంత్రించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల : కూరగాయల ధరలను నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. ప్రభుత్వం కూరగాయల ధరలను నియంత్రించకపోవడంపై గురువారం నేరేడుచర్లలో నిరసన తెలిపి మాట్లాడారు. కూరగాయలు ధరలు పెరిగి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే లాట్ మార్కెట్ ధరలపై చర్యలు తీసుకొని సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. నాయకులు వెంకట్, శ్రీను, నాగేశ్వర్‌రావు, రామస్వామి, మట్టయ్య, సైదానాయక్, గోర్యానాయక్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలో జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా ఎల్‌టీ లైన్ కరెంటు తీగల మరమ్మతులు చేపడుతున్నందు న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మ ధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

శిథిలావస్థలో కల్వర్టు

- కల్వర్టు వద్ద రాత్రి సమయంలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

గరిడేపల్లి : మండలంలోని గరిడేపల్లి – కల్మలచెరువు రోడ్డులో గారకుంటతండా అడ్డ రోడ్డు వద్ద సాగర్ ఎడమకాల్వకు అనుసంధానంగా ఉన్న మైనర్ కాల్వపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టు వద్ద కాల్వ కట్ట, ఇరుపక్కల గల రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు గాయాల పాలవుతున్నారు. రెండు సంవత్సరాలుగా కల్వర్టు ప్రమాదకరంగా ఉన్నా ఎన్ఎస్పీ, ఆర్అండ్‌బీ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని అంటున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం గానుగబండ, కల్మల చెరువు, రాఘవపురం, గుండ్లపాడు, జాన్‌పహాడ్‌తోపాటు పలు ప్రాంతాలకు లారీలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రజలు వెళ్తుంటారు. కల్వర్టు విషయాన్ని ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ స్పందన కరువైందని వారు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉందని.. ఆర్అండ్‌బీ అధికారులు ఇరిగేషన్ పరిధిలో ఉందని దాటవేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కల్వ ర్టుకు తొలగించి నూతన కల్వర్టు నిర్మించాలని, కోతకు గురైన కాలువ కట్టకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


గారకుంటతండా వద్ద శిథిలావస్థకు చేరిన మైనర్ కాల్వపై కల్వర్టు

ప్రమాదాలు జరుగుతున్నాయి



గానుగుబండ అడ్డరోడ్డు వద్ద మైనర్ కాలువ కట్ట కోతకు గురై కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కల్వర్టు వద్ద రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించారు.

– సురభి సైదులు, గారకుంటతండా

పాఠశాలకు ఫర్నిచర్ బహూకరణ


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న వెంకటగురుమూర్తి

మునగాల : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వంగవేటి వెంకటగురుమూర్తి పుట్టినరోజు సందర్భంగా గురువారం మునగాల మండలంలోని గణపవరంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాసవీ క్లబ్ మునగాల శాఖ ఆధ్వర్యంలో ఫర్నిచర్ (ఆఫీసు టేబుల్, ఛైర్), స్టేషనరీతో పాటు విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు తల్లాడ ఉపేందర్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం వెంకటగురుమూర్తిని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామపెద్దలు కొండపల్లి నరసింహారావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, క్లబ్ జిల్లా బాధ్యులు పీవీడీ.ప్రసాద్, జిగిని ప్రసాద్, జెడ్పీ బెలిదీభరత్, షేక్ రమేష్, చిల్లంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం'

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో కాలం వెళ్లదీస్తుందని బీఆర్ఎస్ నియోజకవర్గ పార్టీ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ ఆరోపించారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులకు వీలుగా ఎడిట్ ఆప్షన్ ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని, ప్రజలు తీరా ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తే అధికారులు అలాంటివి ఏమి లేవని చెబుతున్నారని తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో మార్పులకు ఎడిట్ ఆప్షన్ అవకాశం కల్పించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు


హుజూర్‌నగర్‌లో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం హుజూర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ హాల్‌లో కాంగ్రెస్ ఎస్టీ సెల్, ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 40 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఫౌండేషన్ చైర్మన్ కుక్కల వెంకన్న, ఎస్టీ సెల్ నాయకుడు తేజావత్ సైదులు, ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, నాయకులు మంజూనాయక్, శ్రవణ్‌కుమార్, ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, జక్కుల శంబయ్య, జక్కుల వీరన్న, గణేష్, మల్లయ్య, రవినాయక్, హరిబాబు, అమర్‌నాథ్‌రెడ్డి, రాయల వెంకటేశ్వర్లు, రామ్‌రెడ్డి, జ్ఞానయ్య, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వద్ద మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాయకులు యరగాని నాగన్న, గెల్లి రవి, కోతి సంపత్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో దొంతగాని పద్మ, దొంగిరి మంగమ్మ, అరుణ్ కుమార్, హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, సీహెచ్.రాము, టి.రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కోదాడ మండలంలోని గుడిబండలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. కోదాడ పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గణపవరం, కాపుగల్లు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, ఇర్ల సీతారాంరెడ్డి, రేవూరి వెంకటాచారి, బుడిగం నరేష్, నర్సింహారెడ్డి, కుక్కడపు నాగరాజు, ఇర్ల నారపరెడ్డి, రఫీ, ఎరగాని లక్ష్మయ్య, రాజారావు, ప్రసాద్, సత్యనారాయణ, కాసాని శ్రీను, కొండా నర్సింహారావు, బండి కోటయ్య తదితరులు ఉన్నారు.


హుజూర్‌నగర్ : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : పట్టణంలో మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. హుజూర్‌నగర్ రోడ్డులో మాజీ సర్పంచ్ ఏర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, మున్సిపల్ కార్యాలయంలో, కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల, పీసీసీ డెలిగేట్ సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, కందుల కోటేశ్వరరావు, నెమ్మాది ప్రకాష్‌బాబు, దేవమణి, బాగ్దాద్, వంటిపులి శ్రీను, గోవిందు, నవీన్, నరేష్, కౌన్సిలర్‌లు ఉన్నారు.

పాలకవీడు : మండల వ్యాప్తంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్‌వి.సుబ్బారావులు తమ అనుచరులతో కలిసి జాన్‌పహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డిగూడెంలో 220 మంది కేజీబీవీ విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి నీమానాయక్, వైస్ ఎంపీపీ పిన్నెల్లి ఉపేందర్‌రావు, బూషిపల్లి వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సైదులు, నాగరాజు, నాగయ్య, సుబ్బుగౌడ్, నాగేశ్వరరావు, సందీప్, రాము, మధు, శేషు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : గుడిబండలో కేక్ కట్ చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


కోదాడరూరల్ : గణపవరంలో..

'మోతె'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మోతె : ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో మోతె మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు అందుతున్నాయా.. లేదా అనే విషయంపై రెండు రోజుల్లో నివేదిక అందించాలని ఎంపీడీఓను ఆదేశించారు. మండలంలో పెండింగ్ పనుల వివరాలు తనకు తెలపాలన్నారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. నామవరంలో పశువైద్య ఉప కేంద్రం నిర్మాణానికి ఎస్టిమేషన్ వేసి నివేదిక అందించాలన్నారు. విద్యుత్ ఏఈ రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఏఈని హెచ్చరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. మండంలో ప్రజల నుంచి వచ్చిన ప్రజా సమస్యల ధరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీటీసీలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సూర్యాపేట జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, జెడ్పీటీసీ పుల్లారావు, ఆర్డీఓ, తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మైనంపాటి గుర్వారెడ్డి, మధుసుదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మోతె : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కోదాడరూరల్ : మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో రూ.25 లక్షల మంత్రి నిధులతో చేపట్టిన ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనాన్ని ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. పనుల్లో అలసత్వం వహించకుండా నాణ్యత ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎంఏ జబ్బార్, కౌన్సిలర్లు నెమ్మాది వీరబాబు, మామిడి పద్మావతి, సంపెట రవి, మామిడి రామారావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు గురువారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రైతు సమన్వయ సమితి గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పుల ఇంద్రారెడ్డి, ముదిరెడ్డి, కనికిరెడ్డి, దొంతిరెడ్డి రామనర్సిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాలె సామియేలు, నాయకులు రెణబోతు వీరారెడ్డి, చేగొండి శ్రీనివాస్ యాదవ్, అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, గోవింద రామారావు, షేక్ పాషా పాల్గొన్నారు.

జానకమ్మ మృతి బాధాకరం

మునగాల : కలకోవకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జూకూరి గుర్వయ్య భార్య జానకమ్మ (72) మృతి బాధాకరమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం అనారోగ్యంతో జానకమ్మ మృతిచెందారు. గురువారం కలకోవలో జరిగిన ఆమె అంత్యక్రియలకు పద్మావతి హాజరై నివాళులర్పించారు. అనంతరం గురవయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పనస విజయ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, సీనియర్ నాయకులు దొంగరి అప్పారావు, పనస సింహాద్రి, పనస చిన్న శ్రీను, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : కొమరబండలో ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


మునగాల : ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ధర్నాను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28 గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాణోతు బాబునాయక్ పిలుపునిచ్చారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎమ్మెస్ కళాశాలలో ఆయన ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన తండాలను, గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలు గుర్తించాలని, మైదాన ప్రాంత ఎస్టీ గిరిజనుల కోసం ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని గిరిజనులు, ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములను శాశ్వత పట్టాలు ఇవ్వడంతో పాటు పలు డిమాండ్లతో ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, ఎస్ఎస్‌రావు, పంది తిరపయ్య, గంగధరరావు, వీరస్వామి, రహీం తదితరులు ఉన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఎం నాయకుడు మృతి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో సీపీఎం నాయకుడు గరిడేపల్లి వెంకన్న (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎంపీటీసీ చీకూరి రాజారావు, మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, న్యాయవాది కాల్వ శ్రీనివాసరావులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

చిలుకూరు : మండల వ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ గిరిబాబు మాత్రల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నర్సిరెడ్డి, డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నడిగూడెం : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం తహసీల్దార్ హేమామాలిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, స్థానిక పల్లె దవాఖానా వైద్యుడు హరినాథ్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది కళావతి, కృష్ణమూర్తి, రాధ, మహేశ్వరి, అధ్యాపకులు ఉష పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు సహకరించాలి

హుజూర్‌నగర్ : పిల్లల్లో ఎదుగుదలకు అవరోధంగా నిలిచే నులిపురుగుల నిర్మూలనకు అందరూ సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లోని ఏవీఎం పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, లలిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నడిగూడెం : గురుకులంలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న తహసీల్దార్ హేమామాలిని

ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించొచ్చు

నేరేడుచర్ల : విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించవచ్చని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. గురువారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జయ, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ నాగయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారిని నాగిని, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు సైదా, సునిత, ఆశా వర్కర్లు ఉన్నారు.


మునగాల : బరాఖత్‌గూడెంలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ రమేష్ దీనదయాళ్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మున్సిపాలిటీలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. హెచ్ఎం అనసూర్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకరెడ్డి, ఉపాధ్యాయురాలు మజిదాబేగం, లయన్స్‌క్లబ్ సభ్యులు రామస్వామి, సైదులు, శ్రీను ఉన్నారు.

మఠంపల్లి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఎంపీడీఓ జానకిరాములు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్‌లు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. భీల్యానాయక్‌తండాలోని పాఠశాలలో జెడ్పీటీసీ బానోతు జగన్ నాయక్ పిల్లలకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాము, ఎంఎన్‌ఓ వేణు, ఉపాధ్యాయులు మస్తాన్, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని మునగాల, రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, మండల వైద్యాధికారి పోలేపల్లి రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ పుష్పలత

భావితరాల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


పాలకవీడు : గుండ్లపహాడ్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అధికారులు

పాలకవీడు : భావితరాల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీఓ దయాకర్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాలకవీడు మండలంలోని అన్ని పాఠశాలల్లో వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి నల్వరి శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీని జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత అన్నారు. గురువారం మండలంలోని లింగగిరిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావుతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి సోనార్, సీహెచ్‌ఓ పద్మ, ఏఎన్ఎం అలివేలుమంగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.